# 'అప్పిగాడూ - నేనూ - ఛేజూ-'

అక్షరాభ్యాసమవగానే మా అమ్మ నాతోటి అమరకోశము, ఆంధ్రనామ సంగ్రహమూ, శబ్దమంజరీ వల్లె వేయించేది. ఆరవ తరగతినించీ ఇంగ్లీషు మీడియంలో చదువు సాగినా ఇంట్లో కచ్చితంగా అవి వల్లె వేయాల్సిందే.

అవికాక ఇంట్లో మా అమ్మకిష్టమైన రఘువంశం. వావిళ్ల వాళ్లది సటీకం వుండేది. అందులోంచీ కనీసం ఓ శ్లోకం చదవాల్సిందే.

ఎస్సెల్సీలో అప్పిగాడు మాతో కలిసాడు. అప్పటివరకూ వాడి చదువంతా తెలుగు లేకుండా సాగింది. మా కర్నూలుకు వాళ్ల అమ్మనాన్నల బదిలీ మూలంగా రావల్సి వచ్చింది. వాళ్లమ్మా నాన్నలిద్దరూ డాక్టర్లు.

ఇక్కడ మా బళ్లల్లో తెలుగు పాఠ్యాంశంగా చదివి తీరాలి. వాడికి తెలుగు అక్షరాలు కూడా రావు. పదిహేనేళ్ల వయస్సులో అక్షరాలు దిద్దడమంటే చాలా కష్టం. ఏవో లోపాయకారీ పనులుచేసి ఇంటర్మీడియట్ దాకా దేకి ఆనక మెడిసిన్‌లో చేరి ఊపిరి పీల్చుకున్నాడు. ఈ రోజుకీ తెలుగు అక్షరాలు కూడబలుక్కునే చదువుతాడు మా అప్పిగాడు.

వాడి పరిచయమయ్యే వరకూ తెలుగులో సీరియస్ సాహిత్యం చదివినా ఇంగ్లీషులో మాత్రం నా అభిమాన రచయిత ఛేజ్... అప్పటికే అలాంటి పుస్తకాల పైరేట్ ఎడిషన్లు వచ్చేవి. అవి మా హెడ్ పోస్టాఫీసు దగ్గరా, కొండారెడ్డి బురుజు దగ్గరా పదిపైసల బాడుగకు దొరికేవి. (అప్పట్లోనే నేను జేమ్స్ హ్యాడ్లీ ఛేజ్ నవల (Safer dead) 'కాంక్రీటు శవాలు' అని తెలుగు కూడా చేశాను. ప్రచురించలేదు లెండి.)

ఇప్పటికీ ఎక్కడ 'ఛేజ్' 'ఎలరీ క్వీన్' 'అగాథా క్రిస్టీ' 'గార్డ్‌నర్' కనిపించినా, అది ఎన్నిసార్లు చదివిందైనా మళ్లీ చదువుతాను. 'నీకు క్రిమినల్ మనస్తత్వముంది' అని స్నేహితులు అంటుంటారు. (నిజమే మరి దుర్మార్గపు రాతలు రాసి పాఠకుల్ని దారుణంగా హింసిస్తూంటానని పాత్రికేయ మిత్రుడు గుడిపాటి అంటారు.)

సరే అప్పిగాడు (భేరి సుబ్రహ్మణ్య అప్పారావు ఎం.డీ. అనకాపల్లి హాస్పిటల్ సూపరిండెంట్) కల్సిం తర్వాతనే చదివే పుస్తకాలు క్రమంగా మారాయి. 'పో' కథలూ 'కానన్‌డోయిల్' షెర్లాక్‌హోమ్స్ కథలూ మొత్తం చదివించాడు. వాళ్ల కవితావచనం అందమైన భాష నన్ను కొద్దిగా మెరుగుపెట్టాయి.

మా అప్పిగాడు బాగా ధనవంతుడు. వాడి సొంత లైబ్రరీ ఉండేది అప్పటికే- వాళ్ళింట్లోనే షెటిల్ కోర్టు - కాకపోతే క్యారమ్సూ... ఆ తర్వాతికాలంలో పేకా ఆడేవాళ్లం. జీవితం మమ్మల్నందర్నీ చెల్లాచెదురుగా విసిరేసినా... మా స్నేహం ఇప్పటికే సలక్షణంగా కొనసాగుతోంది.

అరే శాఖా చంక్రమణం జరుగుతోంది. పుస్తకాలూ అప్పిగాడూ కదా టాపిక్కు. పరిచయం స్నేహంగా పరిణమించిం తర్వాత అప్పిగాడు వాడి లైబ్రరీ మీద నాకు సర్వహక్కులూ ఇచ్చాడు. (నా కొక్కడికీ వాడి పుస్తకాలు తాకే స్వతంత్రముండేది.) అప్పారావుకి చదివే అలవాటు వాళ్ల నాన్ననించే సంక్రమించింది. ఆయన లైబ్రరీ వేరు మళ్లీ... అదేమి మనస్తత్వమోగానీ ఆయన నాటికి నేటికీ క్రైం పుస్తకాలే చదువుతారు.

చాల్రోజులకు పాత స్నేహితులం వైజాగ్‌లో మా అప్పిగాడింట్లో కలిసాం. విశాఖ పట్నంలో సముద్రపొడ్డున ఓ విశాలమైన బంగ్లా కట్టుకున్నాడు. వాళ్ల నాన్నగారు బాగా వృద్ధులై ఉన్నారు. ఒక కన్ను పూర్తిగా కనబడదు. ఉన్న ఒక్క కంటితోనే క్రైం నవలలు చదువుతున్నారాయ.

సరే మాటల్లో నా నవల నొకదాన్ని సినిమా కోసం ప్రముఖ దర్శకులు శ్రీ కె.ఎన్.టి. శాస్త్రిగారికిచ్చానని చెబితే అప్పిగాడు "వెధవా! ఆర్ట్ సినిమాలకి కథల్రాస్తే ఏమొస్తుందిరా... హాయిగా ఛేజ్ నవలల్ని తిరగరాయి మాంచి సినిమా కథలు ఓ పదిహేన్దాకా వస్తాయి. ఈరోజుల్లో డబ్బు కావాలిరా డబ్బు... నీలాంటి సీరియస్ రచయితల్కి ఏమొస్తుంది. తెలుగుదేశంలో ఏ రచయితైనా డబ్బు చేసుకుంటున్నాడంటే సినిమా రచయితేరా" అన్నాడు.

నిజమే!

'ధనమార్జయ కాకుత్థ ధనమూలమిదం జగత్
అన్తరం నాభిజానామి నిర్ధనస్య మృతస్యచ'
అని కదా ఓ పెద్దమనిషెవరో చెప్పాడూ...

* * *

ఈ వ్యాసాలు పుస్తకంగా వస్తూన్న నేటికి అప్పారావూ వాళ్ల నాన్నా యిద్దరూ గతంగా మారిపోయారు. ●